epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 30 | మంగళవారం | 14.05.2024



## జనగామలో స్వల్ప ఘర్షణలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వాగ్వాదం.. చెదర గొట్టిన పోలీసులు

# పోలింగ్.. పీస్‌ఫుల్!

- రాష్ట్ర వ్యాప్తంగా 75 శాతం పైగా ఓటింగ్
- అత్యధికంగా భువనగిరిలో 72.34 శాతం
- అత్యల్పంగా హైదరాబాద్‌లో 39.17 శాతం




### పార్లమెంట్ సెగ్మెంట్ల వారిగా పోలింగ్ శాతం (6 గంటల వరకు)

| | |
|---|---|
| ఆదిలాబాద్ | 69.81 |
| పెద్దపల్లి | 63.86 |
| కరీంనగర్ | 67.67 |
| నిజామాబాద్ | 67.96 |
| జహీరాబాద్ | 71.91 |
| మెదక్ | 71.33 |
| మల్కాజ్ గిరి | 46.27 |
| సికింద్రాబాద్ | 42.48 |
| హైదరాబాద్ | 39.17 |
| చేవెళ్ల | 53.15 |
| మహబూబ్‌నగర్ | 68.40 |
| నాగర్ కర్నూల్ | 66.53 |
| నల్గొండ | 70.36 |
| భువనగిరి | 72.34 |
| వరంగల్ | 64.08 |
| మహబూబాబాద్ | 68.60 |
| ఖమ్మం | 70.76 |

**వరంగల్, మన చౌరాస్తా ప్రతినిధి:**

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్య ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి 25 రోజుల పాటు సాగిన ప్రచార పర్వానికి ఫలితంగా.. ఓటర్లు తమ నిర్ణయాన్ని సోమవారం ఈవీఎం మెషిన్లలో నిక్షిప్తం చేశారు. అయితే దేశంలో సాగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాలుగో విడుతలో తెలంగాణలోని 17 పార్లమెంట్ సెగ్మెంట్లతో పాటు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికకు పోలింగ్ నిర్వహించగా.. కొన్ని చెదురు ముదురు ఘటనలు తప్ప అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా ముగిసింది. మొదటి ఒకటి రెండు గంటలు ఈవీఎంలు మొరాయించిన తరువాత పూర్తిస్థాయిలో సజావుగా పోలింగ్ జరిగింది. దీనికి తోడు రోజంతా వాతావరణం కూడా ఓటర్లకు సహకరించడంతో 2019 తో పోల్చితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బూతులకు క్యూ కట్టారు. ఎండ కారణంగా.. ఉదయం పూట ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ బూతుల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోగా.. మధ్యాహ్నం సమయంలో కొంత తగ్గింది.

మిగతా 2లో..



# పోలింగ్.. పీస్‌ఫుల్!

(మొదటి పేజీ తరువాయి)



కాగా.. పోలింగ్ ముగిసే చివరి గంటల్లో ఒక్కసారిగా పోలింగ్ శాతం పెరిగింది. దీంతో పెద్దఎత్తున ఓటర్లు క్యూ లైన్లలో బారులుదీరారు. 6 గంటల వరకు లైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. 6 గంటలలోపు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు టోకెన్లు ఇచ్చి ఓటేసే అవకాశం ఇచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

**అర్ధరాత్రి వరకు పోలింగ్..**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు గంటలకు పోలింగ్ ముగిసిన 1,400 పోలింగ్ కేంద్రాల్లో ఇంకా క్యూ లైన్లలో ఓటర్లు ఉన్నారని సీఈఓ వికాస్ రాజ్ తెలిపారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని వాతావరణం కూడా సహకరించిందన్నారు. లా అండ్ ఆర్డర్‌లో కూడా ఎలాంటి ఇబ్బంది రాలేదని, రాత్రి 7 గంటల తర్వాత ఓటింగ్ డేటా ఎంట్రీ స్టార్ట్ అవుతుందన్నారు. పోలింగ్ రోజు 400 ఫిర్యాదు రాగా, 38 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినట్టు ప్రకటించారు. అదేవిధంగా 200కు పైగా సీ విజిల్ ద్వారా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇక ఎన్నికల్లో రూ. 330 కోట్లు సీజ్ అయ్యాయని, అర్ధరాత్రి వరకు పోలింగ్ శాతం గంట గంటకు మారుతుందన్నారు. మే 14 మధ్యాహ్నం వరకు సరైన పోలింగ్ శాతం చెప్పడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈవీఎంల తరలింపులో వాహనాలకు జీపీఎస్ ఉంటుందని, పటిష్టమైన బందోబస్తు మధ్య ఈవీఎంలను అర్ధరాత్రి లోపు స్ట్రాంగ్ రూములకు తరలిస్తామన్నారు. మే 14వ తేదిన పోలింగ్ పై స్క్రూటినీ ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 కౌంటింగ్ కేంద్రాల వద్ద 44 స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్నాయని, వాటి దగ్గర కూడా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి 24 గంటల పాటు సీసీటీవీ మానిటరింగ్ ఉంటుందన్నారు. అదేవిధంగా మూడంచెల బందోబస్తు సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి మాధవిలతపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిజామాబాద్, జహీరాబాద్‌లలో కేసులు అయ్యాయని, మిగిలిన చోట్ల చెదురుమదురు ఘటనలు తప్ప తీవ్రమైన ఘటనలు ఎక్కడా జరగలేదన్నారు. 2019తో పోల్చితే 2024లో పోలింగ్ శాతం ఎక్కువగా జరిగిందని సహకరించిన ప్రతి ఒక్కరికి వికాస్ రాజు ధన్యవాదాలు తెలిపారు.





# జనగామలో ఉద్రిక్తత

- అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన కాంగ్రెస్ నేత
- అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు
- డోంట్ టచ్ మీ..
- పోలీసుల తీరుపై ఎమ్మెల్యే పల్లా ఆగ్రహం



**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని ధర్మకంచ పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ నాయకులు రావడం ఉద్రిక్తతకు దారితీసింది. అనుమతి లేకున్నా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రావడంతో బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎలా అనుమతించారంటూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఏసీపీ అంకిత్, అర్బన్ సీఐ రఘుపతిరెడ్డిని నిలదీశారు. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల నడుమ తోపులాట జరిగింది. ఏసీపీ అంకిత్‌కు ఎమ్మెల్యే పల్లా నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో తనను చేతులతో నెట్టి వేసేందుకు యత్నించిన ఏసీపీపై 'డోంట్ టచ్' అంటూ ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా మీడియాతో మాట్లాడుతూ పోలీసు అధికారులు కాంగ్రెస్‌కు వంతపాడుతూ ఏకపక్ష ధోరణితో వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గానుగుపహాడ్‌లో సైతం ఓటేసేందుకు రోడ్డుపై ఉన్న ప్రజలపై అర్బన్ సీఐ అకారణంగా లాఠీచార్జి చేశారని మండిపడ్డారు. ఈ ఘటనపై ఎన్నికల సంఘానికి, జిల్లా ఎన్నికల అధికారి, సీపీ, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

## జనగామ జిల్లాలో


# 74.86 %

జనగామ/ స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జనగామ జిల్లాలో 74.86 శాతం పోలింగ్ నమోదయింది. జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో 7,52,395 మంది ఓటర్లు ఉండగా 5,63,218 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో 2,54,110 మంది ఓటర్లు ఉండగా 1,99,581 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 78.54 శాతం ఓటింగ్ నమోదయింది. జనగామ నియోజకవర్గంలో 2,42, 771 మంది ఓటర్లు ఉండగా 1,81, 328 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 74.69 శాతం నమోదయింది. పాలకుర్తి నియోజకవర్గం లో 2,55,514 మంది ఓటర్లు ఉండగా 1,82,309 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 74.86 శాతం పోలింగ్ నమోదయింది.

### మొరాయించిన ఈవీఎంలు...

జిల్లాలో పలు పో లింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించగా, కేంద్రాల్లో లైటింగ్ వసతి లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. జనగామ జిల్లా కేంద్రంలోని 232 పోలింగ్ బూత్‌లో లైటింగ్ లేక ఈవీఎంలపై ఉన్న గుర్తులు కనిపించడం లేదని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేయడంతో సిబ్బంది సెల్‌ఫోన్ లైటింగ్ నడుమ కొద్దిసేపు పోలింగ్ జరిపించారు. జనగామ, పెంబర్తి, గానుగుపహాడ్ సహా పలుచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల నడుమ వాగ్వాదం జరిగింది. గతంతో పోలిస్తే ఈసారి పోల్‌చిట్టీలు, ఓటరు జాబితాలో తమ పేర్లు గల్లంతు వంటి ఫిర్యాదులు ఓటర్ల నుంచి రాలేదు. అధికార యంత్రాంగం ఓటు చైతన్యం, పోల్‌చిట్టీలు వంటి అంశాలపై అవగాహన కల్పించడంతో ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం వచ్చింది. జనగామ నియోజకవర్గంలోని పలు కేంద్రాల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం సందర్శించారు. పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

### ఓటేసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే..



జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా ఆయన సతీమణి నీలిమ, కుమారుడు అనురాగ్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ప్రభుత్వ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. జనగామ మండలం ఎల్లంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా దంపతులు జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ కాలేజీ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.



# ఓటెత్తారు..









# WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way




**'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.**

## సెల్ : 9676400812


# జనగామలో ఘోర రోడ్డు ప్రమాదం

- మొబైల్ టిఫిన్‌సెంటర్‌పై దూసుకెళ్లిన బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా రఘునాథపల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న ఓ మొబైల్ టిఫిన్ సెంటర్ పైకి ఆర్టీసీ బస్సు దూకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పూర్తి వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. బీబీనగర్ నుంచి వరంగల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తు ఓ కుటుంబం జనగామ జిల్లా రఘునాథపల్లి సమీపంలో ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద టిఫిన్ చేసేందుకు ఆగారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ (రాజధాని ఏసీ) బస్సు వారిపైకి దూకొచ్చింది. దీంతో భార్య జ్యోతి (28) ఘటన స్థలంలోనే మృతి చెందాగా.. తీవ్ర గాయాలు అయినా భర్త రవీందర్ (38) జనగామ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇక వారి 8 ఏళ్ల కుమారుడుడు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స



పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పరిశీలన..



జనగామ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్ లో ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ఇతర అధికారులు